నమస్తే తెలంగాణ
# జిందగీ
9
హైదరాబాద్ | శుక్రవారం 22 డిసెంబర్ 2023 www.ntnews.com

వార్తల్లో మహిళ



## ప్రపంచానికి సాయం

**ఫలానా** సాఫ్ట్‌వేర్ కంపెనీ సీఈఓ భారతీయురాలే, ఆ పేరొందిన సంస్థ చైర్ పర్సన్ మహిళే... అనే మాటలు వినిపించే వేళ కొందరి పేర్లు గుర్తుకురాకపోవచ్చు. అంతమాత్రాన వారి ప్రతిభకు వచ్చిన ఢోకా ఏం లేదు. అలాంటి ఓ అరుదైన వ్యక్తిత్వం.. అన్షుల కాంత్. ఆర్థికశాస్త్రంలో ఉన్నతవిద్యను అభ్యసించాక, భారతీయ స్టేట్ బ్యాంక్‌లో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా చేరారు. అనతికాలంలో బోర్డ్ మెంబర్ స్థాయికి ఎదిగారు. 2019లో ప్రపంచ బ్యాంక్ సమూహానికి చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. అంతర్జాతీయ స్థాయిలో కార్యకలాపాలు నిర్వహించే ఈ సంస్థల ఆర్థిక వ్యవహారాలను పర్యవేక్షించడం అంత సులభం కాదు. వివిధ దేశాలకు రుణాలు మంజూరు చేయడం, సామాజిక సంక్షోభాల పరిష్కారానికి పనిచేసే ఎన్జీవోలకు ఆర్థిక సాయం అందించడం సామాన్య విషయం కాదు. పేదరికం నుంచి నిరక్షరాస్యత వరకు ప్రపంచ దేశాలు ఎదుర్కొనే సవాళ్లన్నిటికీ జవాబు వెతకడంలో ప్రపంచ బ్యాంక్ పాత్ర చాలా కీలకం. 'ఈ సమస్యల్ని పరిష్కరించడం అంత తేలిక కాదు. చాలా సమయమే తీసుకుంటుంది. కానీ పనైతే మొదలుపెట్టాం' అంటారు అన్షుల. తను బాధ్యతలు చేపట్టిన తర్వాతే కొవిడ్ లోకాన్ని కుదిపేసింది, దాన్నుంచి కోలుకునేలోగా ఉక్రెయిన్, ఇజ్రాయెల్ యుద్ధాలు విరుచుకుపడ్డాయి. అయినా అన్షుల వెనక్కి తగ్గడం లేదు.

Fashion



## హరిణి.. తరుణి!

**పచ్చని** డ్రెస్ ధరిస్తే.. నల్లమలను చుట్టేసుకున్న భూదేవిలా అనిపిస్తుంది. ఫ్లోరల్ డిజైన్‌ను ఎంచుకుంటే పూలవనాన్ని పొదుగుకున్న పుడమి తల్లిలా కనిపిస్తుంది. పచ్చాపచ్చని వస్త్రం మీద పెద్ద పెద్ద పూల డిజైన్లు ఉన్న ఆర్గాంజా అనార్కలిలో ఈ మాడల్.. వన లచ్చిమిలా మెరిసిపోతున్నది కదూ!



# బేర్‌ఫుట్ సీఈవో

*Sowmya Kidambi*

**సమాజ సేవ కెరీర్‌గానూ మారింది. స్వచ్ఛంద సంస్థ నిర్వహణకు మేనేజ్‌మెంట్ స్కిల్స్ అవసరం అవుతున్నాయి. సోషల్ ఆడిట్.. అతికొద్దిమందికి మాత్రమే సాధ్యమైన కళ . ఇందుకు ఉదాహరణ తెలుగు వనిత సౌమ్య కిడాంబి. అంచెలుగా ఎదిగిన సౌమ్య తాజాగా జీవన నైపుణ్యాల విద్యాలయం బేర్‌ఫుట్ కాలేజ్ సీఈవోగా బాధ్యతలు చేపట్టారు.**

**సౌ**మ్య కిడాంబి.. అచ్చమైన మధ్యతరగతి యువతి. పదహారణాల తెలుగు కుటుంబం ఆమెది. డిగ్రీ వరకు వైజాగ్‌లో చదివారు. ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో మాస్టర్స్ చేశారు. కొలంబియా విశ్వవిద్యాలయంలో మానవహక్కుల చరిత్ర-సాధనపై పరిశోధన చేశారు. ఆ తర్వాత, మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ అనే స్వచ్ఛంద సంస్థలో చేరారు. ప్రముఖ సంఘ సేవకురాలు అరుణా రాయ్ స్థాపించిన ఈ సంస్థ గురించి చాలామందికి తెలియకపోవచ్చు. సమాచార హక్కు, కనీస వేతనాల చట్టం, ఉపాధి హామీ పథకం.. మజ్దూర్ సంఘటన్ పోరాట ఫలితాలే. ఆ లక్ష్యాల సాధనలో అరుణ నేతృత్వంలో సౌమ్య కిడాంబి కృషి అపారం. మజ్దూర్ కిసాన్ శక్తి సభ్యురాలిగా ఏడేళ్ల పాటు క్షేత్రస్థాయిలోనే ఉన్నారు, దొరికిందేదో తిన్నారు. వీలున్నచోట తలదాచుకున్నారు. 'ఏ విశ్వ విద్యాలయమూ బోధించని విలువైన పాఠాలు క్షేత్ర స్థాయిలో తెలుసుకున్నాను, నేర్చుకున్నాను' అంటారామె. ఉపాధి హామీ లాంటి పథకాలు ఎంత సవ్యంగా అమలవుతున్నాయో నిశితంగా గమనించారు. ఈ తరహా పర్యవేక్షణను 'సోషల్ ఆడిట్' అంటారు. ఈ ప్రక్రియ అప్పటికి మనకు కొత్తే. ఆ ప్రయోగం తనకు అంతర్జాతీయంగా పేరు తీసుకొచ్చింది. అమెరికాకు చెందిన ఇంటర్నేషనల్ బడ్జెట్ పార్ట్‌నర్‌షిప్ (ఐబీపీ) నుంచి ఆమెకు పిలుపు వచ్చింది. ప్రజలకు వీలైనంత మేర మేలు జరిగేలా ప్రభుత్వ సంస్థలు బడ్జెట్ రూపొందించేందుకు ఈ సంస్థ సాయపడుతుంది. ఐబీపీ తరఫున కెన్యా, దక్షిణాఫ్రికా ప్రతినిధులకు సోషల్ ఆడిటింగ్‌లో శిక్షణ ఇచ్చారు సౌమ్య. ఆ తర్వాత 'శాట్' అనే సామాజిక ఆడిటింగ్ సంస్థలో చేరారు. మన దేశంలో సోషల్ ఆడిట్ కోసం స్థాపించిన తొలి స్వతంత్ర సంస్థ ఇది. డైరెక్టర్ హోదాలో సౌమ్య ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాలతో కలిసి పనిచేశారు. సర్కారు పథకాలు సమర్థంగా అమలయ్యేలా కృషి చేశారు. పేదల హక్కులకు పెద్దపీట వేశారు.



### బేర్‌ఫుట్ కాలేజ్

..ఇంతలో బేర్‌ఫుట్ కాలేజ్ రూపంలో ఓ అరుదైన అవకాశం సౌమ్య తలుపు తట్టింది. రాజస్థాన్‌లోని తిలోనియాలో ప్రారంభించిన ఈ అక్షరాలయంలో పిల్లలు, పెద్దలు.. ఎవరైనా సరే రాత్రిబడులకు వెళ్లొచ్చు. అక్షరాస్యత పెంచుకోవచ్చు. జీవన నైపుణ్యాలను మెరుగుపర్చుకోవచ్చు. గ్రామీణ ప్రజలకు.. అందులోనూ మహిళలకు నీళ్లు, విద్యుత్ చాలా అవసరం. వాటి కోసం ఇంటిపెద్ద నుంచి కేంద్ర సర్కారు వరకు చాలా మంది మీద ఆధార పడాల్సిందే. ఎవరో ఒకరు దయ చూపితేనే పని అవుతుంది. ఎందుకింత పరాధీనత? బేర్‌ఫుట్ కాలేజ్ ఈ రెండు విషయాల్లోనూ సాధికారతకు యత్నిస్తున్నది. సౌర విద్యుత్‌తో వంట చేసుకునేందుకు, ఇంట దీపం వెలిగించుకునేందుకు సాయపడుతుంది. అవసరమైతే నీటి పంపులను బాగు చేసుకునే నైపుణ్యాన్నీ అందిస్తుంది. ఈ కాలేజ్‌లో సర్టిఫికెట్లు ఉండవు. కచ్చా నేల మీదే బోధన జరుగుతుంది. అందుకే 'బేర్‌ఫుట్ కాలేజ్' అని పేరు పెట్టారు. రాజస్థాన్‌లోని కరువు ప్రాంతాలను దగ్గర నుంచీ చూసి చలించిపోయిన బంకర్ రాయ్ దీని వ్యవస్థాపకుడు. ప్రజలకు కేవలం చదువే సరిపోదని, జీవితాల్నీ మెరుగుపరచాలని.. స్వశక్తితో కరువును, పేదరికాన్ని ఎదుర్కోవడానికి సరిపడా సాంకేతికతను అందించాలనీ రాయ్ భావించారు. ఆ లక్ష్యంతో తీర్చిదిద్దిన వ్యవస్థే ఇది. యాభై సంవత్సరాల్లో బేర్‌ఫుట్ కాలేజ్ లక్షలమందిని ప్రభావితం చేసింది. బంకర్‌రాయ్ ప్రపంచంలోని అత్యంత ప్రభావశీల వ్యక్తులలో ఒకరిగా నిలిచారు. ఆయన వృద్ధాప్యంలోకి అడుగుపెట్టాక, బేర్‌ఫుట్ కాలేజీకి సమర్థ నాయకత్వం అవసరమైంది. ఆ సమయంలో బంకర్ రాయ్ సతీమణి అరుణా రాయ్‌కి సౌమ్య గుర్తుకొచ్చారు. మజ్దూర్ సంఘటన్‌లో తనతో పనిచేస్తూ... సంస్థ ఆశయాలకు నిలువెత్తు రూపంగా మారిన సౌమ్య బేర్‌ఫుట్ కాలేజ్‌ను అంతే ఉత్సాహంగా నడిపించగలరనే నమ్మకం కలిగింది. ఈ ఏడాది జూన్‌లో సౌమ్యను బేర్‌ఫుట్ కాలేజ్ సీఈఓగా నియమించారు. 'తమ జిల్లాలో, గ్రామంలో ఏదైనా కొత్తగా ప్రారంభించాలని కోరుకునేవారు ఎంతోమంది. రోజూ నాకు గ్రామీణ మహిళల నుంచి అనేక ఫోన్‌కాల్స్ వస్తుంటాయి. ఎదగాలనే ఆకాంక్షకు ఇదే తార్కాణం' అంటారు సౌమ్య కిడాంబి.

## చలికాలం.. చెవికాలం

**చలికాలం ఇన్ఫెక్షన్ల తీవ్రత ఎక్కువ. తక్కువ ఉష్ణోగ్రత కారణంగా వైరస్, బ్యాక్టీరియా వృద్ధి చెందే ఆస్కారం అధికం. ఇలాంటి పరిస్థితుల్లో చెవికి సంబంధించిన సమస్యలు కూడా ఎక్కువ అవుతాయి. ఇన్ఫెక్షన్లే కాకుండా పొడిగాలులు, రక్తప్రసరణ సమస్యలూ ఇందుకు దోహదపడతాయి. ఈ సమయంలో కొన్ని జాగ్రత్తలు అవసరం.**

- హీటింగ్ ప్యాడ్ లాంటివి చెవినొప్పి నుంచి కొంత ఉపశమనం ఇస్తాయి.
- చెవిలోకి నీళ్లు వెళ్లకుండా...లోపలంతా శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.
- ఇన్ఫెక్షన్ ఉన్నప్పుడు, గాలి సోకకుండా చెవిని దూదితో మూసేస్తే సమస్య మరింత తీవ్రం కావచ్చు.
- పొగ అలవాటు వల్ల ఊపిరితిత్తులతో పాటు, చెవిలో కూడా అసౌకర్యం పెరిగే ఆస్కారం ఉంది.
- చెవిలోకి నేరుగా గాలి వెళ్లకుండా ఇయర్ మఫ్స్ లేదా మఫ్లర్ చుట్టుకోవడం మంచిది.



**చెవిపోటు** నొప్పితో ఆగదు. వాపు, శిరోభారం, కళ్లు తిరగడం.. లాంటి సమస్యలతో పాటు వినికిడి లోపం కూడా తలెత్తవచ్చు.

## క్లాస్.. పెద్ద కాసు!

**కాసులపేరు పాత ముచ్చట కానేకాదు. కాసులనేవి మాలకే పరిమితం కాలేదు. నెక్లెస్, దుద్దులు, ఉంగరాలు.. ఇలా కొత్తకొత్త రూపాల్లో మెరుస్తున్నాయి. అయినా సరే వీటిలో మరింత వైవిధ్యాన్ని కోరుకునే వారికోసం పెద్ద కాసులతో గొలుసులు తయారు చేస్తున్నారు డిజైనర్లు. బోల్డ్‌గా కనిపించే స్టేట్‌మెంట్ నగల్ని ఇష్టపడేవాళ్లు, ఇందులోనూ స్టైల్ స్టేట్‌మెంట్ చూపించాలని తహతహలాడుతున్నారు.**

**పాత** కొత్తల మేళవింపు.. ఫ్యాషన్ జువెలరీ. పాతొక వింత ఇప్పుడు. పాతనే మరింత అందంగా, ఇంకాస్త కొత్తగా చూపించడానికి తమవంతు ప్రయత్నం చేస్తున్నారు సృజనకారులు. ఇందులో భాగంగా నగల ప్రపంచంలోకి అడుగుపెట్టినవే పెద్ద కాసుల గొలుసులు. చిట్టి కాసులు, మామూలు లక్ష్మీ కాసులకు మూడింతలు ఉంటుంది వీటి పరిమాణం. సాదాగా సాధారణ కాసు నమూనాలోనే కాదు, చుట్టూ నగిషీలు చెక్కినవీ ఈ తరహాలో వస్తున్నాయి. తళుకులీనే బంగారు వన్నెతో పాటు, యాంటిక్ హంగులతో తీర్చిదిద్దుతున్నారు. అదనంగా రాళ్లను కూడా జోడిస్తున్నారు. ఈ పెద్ద కాసులతో హారాలు, బీడెడ్ గొలుసులు, నెక్లెస్‌లు.. ఇలా రకరకాల కంఠాభరణాలు రూపొందిస్తున్నారు. తయారీలో నెమళ్లు, మామిడి పిందెలు, పువ్వుల డిజైన్లను వాడుతున్నారు. మొత్తంగా మెడలో పెట్టుకుంటే ఎంతో విభిన్నంగా, మరింత ప్రత్యేకంగా కనిపించేలా రూపు దిద్దుతున్నారు. కాసును చూడగానే సంప్రదాయంగా అనిపించినా, చూడ్డానికి స్టేట్‌మెంట్ నగల్లా కనిపిస్తూ ట్రెండీ జువెలరీతో పోటీ పడుతున్నాయి. అందుకే ఈ పెద్ద కాసుల పేర్లను కాంతమ్మ గారే కాదు.. కాంతలంతా వేసుకుంటున్నారు!



నగ ధగలు



సర్వే

## కార్పొరేట్‌లోనూ సగం



**యాభై** ఏళ్ల నాటి సంగతి. మహిళలు ఉద్యోగం చేయడమే ఓ వింత. ఒక్కో దశాబ్దం గడుస్తున్న కొద్దీ పరిస్థితిలో మార్పు వచ్చింది. అద్దాల గోడలు భళ్లున పగిలిపోయాయి. కార్పొరేట్ కారిడార్లు సగౌరవంగా ఆమెకు స్వాగతం పలికాయి. దిగ్గజ సంస్థల్లో మహిళలు ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. పురుషులతో సమానంగా కొలువులు చేస్తున్నారు. తాజా గణాంకాలు దీన్ని నిరూపిస్తున్నాయి.

- నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ జాబితాలోని తొలి 500 (నిఫ్టీ 500) కంపెనీల బోర్డుల్లో మహిళల ప్రాతినిధ్యం 18 శాతం. పదేళ్ల క్రితం అది 6 శాతమే.
- వీటిలో 95 శాతం కంపెనీల బోర్డులలో ఒక్క మహిళ అయినా కనిపిస్తుంది. 2017లో అది కేవలం 69 శాతం!
- బోర్డులో ఒకరికి మించి ప్రాతినిధ్యం కల్పించిన కంపెనీలు 40 శాతానికి పైమాటే!
- కంపెనీ బోర్డులో ఆడిట్ కమిటీ లాంటి విభాగాలకు పురుషులనే నియమించాలి అనే అలిఖిత నిబంధన ఉండేది. ఈ పరిమితులను కూడా దాటుతున్నారు మహిళలు.

**..గతంతో** పోలిస్తే పరిస్థితులు మారుతున్నా.. సమాన స్థానం కోసం మహిళలు మరింత దూరం ప్రయాణించాల్సి ఉంది. ఉదాహరణకు నిఫ్టీ 500లో 5 శాతం కంపెనీలలో మాత్రమే మహిళా చైర్ పర్సన్‌లు ఉన్నారు!



## ఏక్ నంబర్ ఫుడ్!

**ఎనిమిదేండ్ల** నుంచీ 'స్విగ్గీ'లో బిర్యానీదే హవా. అర్ధరాత్రి వరకూ ఆర్డర్లే ఆర్డర్లు. అందులోనూ, పది బిర్యానీ పొట్లాల్లో తొమ్మిది చికెన్ బిర్యానీలే. హైదరాబాద్ జనం బిర్యానీ తిని బతికేస్తుంటే.. స్విగ్గీ సిబ్బంది బిర్యానీ ప్యాకెట్లు డెలివరీ చేసి బతికేస్తున్నారు. ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ తాజా గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. ఇక స్వీట్స్ విషయానికొస్తే.. డబుల్ కా మీఠా, గులాబ్‌జామ్, చాకో లావా కేక్.. కెవ్వు కేక్స్ అనిపించాయి. చాయ్ టైమ్ స్నాక్‌గా సమోసాకు తిరుగులేదని తేలిపోయింది. మస్కా బన్‌తో డైటింగ్‌కు మస్కా కొట్టినవారి సంఖ్యా తక్కువేం కాదు. 'ఈ లెక్కల్ని బట్టి.. హైదరాబాద్‌ను బిర్యానీ రాజధానిగా గుర్తిస్తున్నాం. ఈ సంవత్సరాన్ని బిర్యానీ నామ సంవత్సరంగా ప్రకటిస్తున్నాం. మరింత మందికి బిర్యానీ వడ్డించే ప్రయత్నం చేస్తాం' అంటారు స్విగ్గీ ప్రతినిధులు.